క్లుప్తంగా

బ్యానర్ చింపివేయడంపై పోలీసులకు ఫిర్యాదు

నున్న(విజయవాడరూరల్): మహానేత డాక్టర్ వైఎస్సార్ జయంతి సందర్భంగా నున్న కోటకట్ట సెంటర్లో ఏర్పాటు చేసిన బ్యానర్‌ను చించి వేయడంపై వైఎస్సార్ సీపీ కార్యకర్తలు బుధవారం నున్న పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బ్యానర్‌ను చించి వేసిన వారిని గుర్తించి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బ్యానర్లు చించి ఘర్షణ వాతావరణానికి పురి కొల్పినట్లుగా ఉందని పేర్కొన్నారు. ఎస్‌ఐ కి వినతి పత్రం అందచేసిన వారిలో ఏఎంసీ మాజీ సభ్యుడు దండు సుబ్రహ్మణ్యం రాజు, కార్యకర్తలు గుంటక నాని, భీమవరపు నరేంద్ర, పోలారెడ్డి రంగారెడ్డి, తదితరులున్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

కేసరపల్లి(గన్నవరం): దుర్గాపురంలో రూ. 20 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయితీ నిధులు రూ. 1.20 కోట్లుతో కొత్తగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సీసీ రోడ్లు, డ్రైయిన్లు, శ్మశానవాటిక ప్రహరీ, బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం ప్రాంతంలో గోడ నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు చెప్పారు. దశబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని శివారు ప్రాంతాలు దుర్గాపురంలో రూ. 40 లక్షలు, సగర్లపేటలో రూ. 10 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. వార్డు సభ్యులు మేకల రత్నమాల, యర్రగాని రత్తయ్య, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల పటిష్టతకు కృషి

పెనమలూరు: గ్రామ పంచాయతీల పటిష్టతకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని మండల అభివృద్ధి అధికారి బండి ప్రణవి అన్నారు. రాష్ట్రీయ గ్రామ సర్వరాజ్ అభియాన్ కార్యాచరణ 2025–2026 ఆర్థిక సంవత్సరంలో కెపాసిటీ బిల్డింగ్, పంచాయత్ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ (పీఎఐ 2.0) శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించి ప్రసంగించారు. గ్రామ పంచాయతీల ప్రణాళిక, ప్రతి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు, వైద్యం, విద్య ఇలా అన్ని అంశాలు పీఎఐ 2.0 యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఆయా శాఖ అధికారులు పీఎఐని సమర్థవంతంగా రూపొందించి అమలు చేయాలని సూచించారు. ఈ శిక్షణ తరగతుల్లో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త పింఛన్‌లు మంజూరు చేయండి

పెనమలూరు: అర్హులైన వారికి కొత్తగా పింఛన్‌లు మంజూరు చేయాలని మహిళలు కోరారు. ఎమ్మెల్యే బోడెప్రసాద్ బుధవారం తాడిగడప కాలువ కట్ట పై సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ తమకు గత ఏడాదిగా పింఛన్‌లు మంజూరు చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కొత్త పింఛన్‌లు మంజూరు చేయాలని కోరారు. కాలువ కట్టల పై పారిశుద్ధ్యం, డ్రైనేజీల నిర్మాణం చేయాలని కోరారు. ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామన్నారు. ప్రజల అభివృద్ధే కూటమి లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మారుపూడి ధన కోటేశ్వరరావు, అనుమోలు ప్రభాకరరావు, కోయా ఆనంద్‌ప్రసాద్ పలువురు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: స్థానిక శ్రీనివాస హేచరీస్, చిన్నఆవుటపల్లి ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మధ్య ట్రీ కటింగ్ పనుల నిమిత్తం గురువారం ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వాహణ ఇంజనీర్ పి. హరిబాబు బుధవారం ఓ ప్రకటన తెలిపారు. మర్లపాలెం, విజయ మెడల్స్, వేపగుంట, మేఘన రోడ్, చిన్నఆవుటపల్లిలో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంత విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా కోరారు.

● **పెనమలూరు:** మండలంలోని గంగూరు గ్రామంలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. గంగూరు ఫీడర్ విద్యుత్ లైన్‌ల మరమ్మతులు కారణంగా ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. దీని కారణంగా గంగూరు సెంటర్, బందరు రోడ్డు ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదని స్థానికులు సహకరించాలని కోరారు.

పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌పై శిక్షణ

కంకిపాడు: పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌పై మండల స్థాయి ఒకరోజు శిక్షణ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. పిఏఐ 2.0పై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాన్ని ఎంపీడీఓ పి.అనూష, ఏఓ ఎస్.బసవయ్య, పలువురు మండల స్థాయి అధికారులు పర్యవేక్షించారు.

కూటమి సర్కారును భూస్థాపితం చేసేది ప్రజలే



మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని, దేవభక్తుని తదితరులు



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని

కంకిపాడు: దగాకోరు కూటమి సర్కారును భూస్థాపితం చేసేది ప్రజలేనని వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని అన్నారు. పెనమలూరు నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశం, బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమం కంకిపాడులోని శ్రీకృష్ణ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన పేర్ని నాని మాట్లాడుతూ జనం కోసం, జనం సంక్షేమం కోసం పుట్టిన మహనీయుడు వైఎస్సార్ అని కొనియాడారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. చంద్రబాబు ఏ రోజూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ప్రజలను హామీల పేరుతో వంచించిన ఘనుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. బాబు, పవన్‌లు హామీల పేరుతో ఎంత దగా చేశారో ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ఆ ప్రజలే బాబు, పవన్‌లు, బోడె సంగతి కూడా తేల్చుకుంటారని చెప్పారు. రెడ్‌బుక్‌తోనే తండ్రీ కొడుకులు, పవన్‌లను ఏంచేయాలో ప్రజలే నిర్ణయిస్తారని పేర్కొన్నారు. ప్రజలను చైతన్యం చేయటం ఒక్కటే పార్టీ కార్యకర్త బాధ్యత అన్నారు. ఏ ఎన్నికలు చూసినా హామీలు అటకెక్కటమేనని, మేనిఫెస్టోలను నిర్లక్ష్యం చేయటం బాబు అండ్‌కోకు అలవాటు అని గుర్తుచేశారు.

రైతులను పట్టించుకున్న పాపాన పోలేదు....

రాష్ట్ర వ్యాప్తంగా కూటమి సర్కారు వైఫల్యాలతో రైతులు నష్టపోతున్నారని పేర్ని నాని అన్నారు. పండిన పంటకు ధర లేక సాయం కోసం రోధిస్తున్నారన్నారు. గుంటూరు జిల్లాలో మిర్చి, పొగాకు రైతుల బాధను అక్కడున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, వ్యవసాయ మంత్రి పట్టించుకోలేదని ఆరోపించారు. మామిడి రైతుల దీన స్థితిని గుర్తించలేని స్థితిలో కూటమి నేతలు మొద్దు నిద్ర పోతున్నారని మండిపడ్డారు. రైతుల పక్షాన జగన్ నిలబడితే ప్రతి చోటా ఆంక్షలు విధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ప్రజలకు ఏ చిన్న కష్టం వచ్చినా అక్కడికి జగన్ వెళ్తారని, ఏ ఒక్కరూ అడ్డుకోలేరని స్పష్టంచేశారు. మోసం అంటేనే చంద్రబాబు, అబద్ధాలు అంటేనే బాబు, పవన్‌లు అని ఎద్దేవా చేశారు. నమ్మించి మోసం చేసే వాళ్లు భారత శిక్షాస్మృతి ప్రకారం శిక్షార్హులేనన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వ మోసాలను వివరిస్తూ చైతన్యం చేయాలని సూచించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి మాట్లాడుతూ ప్రభుత్వ మోసాల పట్ల ప్రజలను చైతన్యం చేయటంలో ప్రతి ఒక్కరూ ముఖ్యపాత్ర పోషించాలన్నారు. సమన్వయంతో పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన సంక్షేమాన్ని వివరించాలని కోరారు. వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేసిన ఘనత టీడీపీ మూటగట్టుకుందన్నారు. ప్రజల మదిలో రాజన్నకు స్థానాన్ని చెరపటం సాధ్యమా అని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో తాడిగడప సెంటరులో వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటుచేసేందుకు సహకరించాలని కోరారు. కార్యకర్తలకు అండగా ఉంటానని అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మచిలీపట్నం పార్లమెంటు పరిశీలకులు జట్టి గురునాథం, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, పార్టీ మండల అధ్యక్షుడు మాదు శ్రీహరిరాణి, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, దాసే రవి, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ విభాగాల నేతలు జంపాన కొండలరావు, వల్లభనేని వెంకటేశ్వరరావు, రాజులపాటి రామచంద్రరావు, ప్రతివాడ రాఘవరావు, నత్తా వెంకటేశ్వరరావు, నక్కా శ్రీనివాసరావు, శివజ్యోతి, రామకోటేశ్వరరావు, సోలే సురేష్‌బాబు, గోన మదన్, హరికృష్ణారెడ్డి, వేమూరి బాలకృష్ణ, ఓంకారం, నాగిరెడ్డి, కోనా కిషోర్, జోజ్ మేరీ, తోకల ఉమాదేవి, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులపై కాలనీవాసులు నిరసన

గన్నవరం: స్థానిక ఎస్సీ కాలనీలోని ప్రధాన రహదారి నిర్మాణ పనులపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ కాలనీవాసులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణ పనులు ముందుగా చెప్పినట్లుగా కాకుండా వెడల్పు తగ్గించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముల్లంగి ప్రతాప్, తిరివీధి వినోద్, కొలకలూరి ఏసుపాదం, విశ్వనాథపల్లి అజయ్ మాట్లాడుతూ కాలనీలోని ప్రధాన రహదారిగా ఉన్న ఈ రోడ్డును పది మీటర్ల వెడల్పున విస్తరించేందుకు తొలుత నిర్మాణ పనులు చేపట్టారని తెలిపారు. ఈ మేరకు రోడ్డుకు ఇరువైపులా చేపట్టిన డ్రెయిన్ నిర్మాణం కోసం పలు షాపులను కూడా తొలగించారని చెప్పారు. కాలనీ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని తాము కూడా అధికారులకు సహకరించినట్లు తెలిపారు. తీరా రోడ్డు నిర్మాణాన్ని ఐదు మీటర్లకు కుదించడం కాలనీవాసులను తీవ్ర నిరుత్సాహానికి గురిచేసిందన్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రధాన రహదారి వెడల్పు తగ్గించడం వల్ల సీసీ రోడ్డుగా నిర్మాణం చేసినప్పటికి ఎటువంటి ప్రయోజనం ఉండదన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి గతంలో చెప్పిన మాదిరిగా రోడ్డును పది మీటర్ల వెడల్పున నిర్మాణం చేయాలని, లేనిపక్షంలో పనులను అడ్డుకుని తీరుతామని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ప్రజాప్రతినిధుల దృష్టికి కూడా తీసుకువెళ్తామని తేల్చిచెప్పారు. కాలనీవాసులు తిరివీధి బీక్షాలు, యామండ అభినేష్, ఏలియా, రాంమోహన్, పాలిమేర రమేష్, కొలకలూరి సాంబయ్య, ఏలియ్య, నాగభూషణం, మహేష్, శ్రీకాంత్, నవీన్, పృథ్వి, జలబిందు తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, అధికారులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ప్రకృతి వ్యవసాయ విధానంతో అధిక లాభాలు పొందవచ్చని, రైతులందరూ ఆ దిశగా ఆలోచన చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ చెప్పారు. బాపులపాడు మండలంలోని ఆరుగొలను, కానుమోలు, రేమల్లే గ్రామాల్లో బుధవారం పర్యటించిన కలెక్టర్ బాలాజీ ప్రకృతి వ్యవసాయం, ఉద్యాన పంటలను పరిశీలించారు. ఆరుగొలను, కానుమోలులో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న పంట పొలాలను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆరుగొలనులో ఎకరం పొలం కౌలుకు తీసుకుని ప్రకృతి వ్యవసాయ విధానాలతో వరి సాగు చేస్తున్న రైతు చలం ప్రసాద్‌తో కలెక్టర్ ముచ్చటించారు. సాగుకు అయ్యే ఖర్చు, పంట దిగుబడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

ఆరోగ్యవంతమైన ఆహార ఉత్పత్తులు..

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించటం వల్ల రైతులకు పెట్టుబడి వ్యయం గణనీయంగా తగ్గుతుందని, ఆరోగ్యవంతమైన ఆహార ఉత్పతులు సమాజానికి అందించవచ్చని కలెక్టర్ తెలిపారు. రసాయన ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల అధిక పెట్టుబడితో పాటుగా భూసారం తగ్గుతుందని, ఆహారం, నీరు కలుషితంగా మారుతున్నాయని, తద్వారా ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పచ్చిరొట్టగా పొలంలో నవధాన్యాలను చల్లటం వల్ల భూమి మరింత సారవంతమవుతుందని తెలిపారు. అనంతరం రేమల్లేలో బెజవాడ ఏడుకొండలు అనే రైతు 14 ఎకరాల్లో సాగు చేస్తున్న కోకో పంటను కలెక్టర్ డీకే బాలాజీ పరిశీలించారు. కోకో పంట సాగుకు అయ్యే ఖర్చు, సాగులో తలెత్తే సమస్యలు, దిగుబడి వంటి విషయాలను రైతును అడిగి తెలుసుకున్నారు. మొక్క నాటిన మూడో ఏడాది నుంచి పంట దిగుబడి వస్తుందని, సాధారణ చాక్లెట్లతో పాటుగా యాంటీ డయాబెటిక్ చాక్లెట్ల తయారీ కంపెనీలకు విక్రయిస్తున్నట్లు రైతు వివరించారు. జిల్లా ఉద్యాన అధికారి జె.జ్యోతి, ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పార్థసారథి, గుడివాడ ఆర్డీవో జి.బాల సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీవో జోగేశ్వరరావు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు పోరాటం



గన్నవరంలో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నేతలు



పోరంకిలో నిరసన ప్రదర్శన చేసి ప్రసంగిస్తున్న నేతలు

గన్నవరం: కార్మికులకు వ్యతిరేకంగా కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరుతూ బుధవారం చేపట్టిన దేశవ్యాప్త సమ్మె గన్నవరంలో ప్రశాంతంగా సాగింది. సమ్మెకు మద్దతుగా కార్మిక, కర్షకులు స్థానిక సీపీఎం కార్యాలయం నుంచి సినిమాహాల్ సెంటర్ మీదుగా గాంధీబొమ్మ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, వ్యవసాయ వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందని ధ్వజమెత్తారు. కార్మిక సంఘాలకు చెందిన కళ్ళం వెంకటేశ్వరరావు, సమ్మక్క, మల్లంపల్లి ఆంజనేయులు, సాంబశివరావు తదితరులున్నారు.

పెనమలూరు: వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాపాడాలని సీఐటీయు రాష్ట్ర నాయకుడు క్రాంతి డిమాండ్ చేశారు. పోరంకి నుంచి తాడిగడప వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ మండల కన్వీనర్ వై.లక్ష్మిప్రసన్న, ఆశా వర్కర్స్ నేతలు రాణి, సరస్వతీ, అంగన్‌వాడీ సంఘ నేతలు రేవతి, విజయలక్ష్మి, కాశేశ్వరి, మున్సిపాలిటీ సంఘ నేతలు వై. సరళ, వెంకటరెడ్డి, రత్నకర్ణ, గ్యాస్‌కంపెనీల సంఘ నేతలు లక్ష్మినారాయణ, సోమశేఖర్, రాంబాబు, ఆటో సంఘ నేతలు మోహన్, జోషి, మండల సీఐటీయు నేతలు షేక్.కాశిం, ఎస్‌కె.బాబు, మస్తాన్‌వలి, శాంతిరాజు, పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్): నున్న, పాతపాడు, పి.నైనవరం గ్రామ పంచాయతీల కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ అధ్యక్షుడు జీవీ రంగారెడ్డి అధ్యక్షతన సభ నిర్వహించారు. భవన నిర్మాణ రంగం కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు పిల్లి నరసింహారావు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి అప్పారావు, రైతు సంఘం మండల కార్యదర్శి కలకోటి శ్రీనివాసరెడ్డి, నున్న గ్రామ అధ్యక్షుడు ఎ.శివయ్య, అంగన్‌వాడీల ప్రతినిధి కోటేశ్వరమ్మ, పంచాయతీ వర్కర్స్ ప్రతినిధి నాగమణి, రోజారాణి, విద్యార్థి విభాగం ప్రతినిధి మహేష్ సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి గుంటక చినవెంకటరెడ్డి తదితరులు మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శి మాతంగి ఆంజనేయులు పాల్గొన్నారు.

గన్నవరం: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మండల కేంద్రమైన ఉంగుటూరులో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. మానికొండ సూర్యవతి శ్రామిక భవనం నుంచి మెయిన్ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా కౌలురైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టీవీ. లక్ష్మణస్వామి మాట్లాడారు. కార్మిక సంఘాల నేతలు ఎం. సత్యవతి, అజ్మీరా వెంకటేశ్వరరావు, మాగంటి సాంబశివరావు, పిల్లి రాజారావు, సిహెచ్. లక్ష్మీ, పుణ్యవతి, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు. ఉంగుటూరులోని కేడీసీసీ బ్యాంక్ బ్రాంచ్ ఎదురుగా పీఏసీఎస్ ఎంప్లాయిస్ ఆందోళన నిర్వహించారు.

ఉయ్యూరు: కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె ఉయ్యూరులో బుధవారం విజయవంతం అయింది. సీఐటీయు ఆధ్వర్యంలో కార్మిక, ప్రజాసంఘాలు మానికొండ భవన్ నుంచి ప్రధాన సెంటరు వరకూ ప్రదర్శన చేపట్టారు. కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు, నాయకులు బి.రాజేష్, సుబ్బారావు, బి.కీర్తి, రత్నం భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు. స్థానిక కేడీసీసీ బ్యాంకు ఎదుట ఆందోళన నిర్వహించారు.

కంకిపాడు: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కంకిపాడు బస్టాండు సెంటరులో బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. మండేపూడి భవన్ నుంచి చేపట్టిన ప్రదర్శన ప్రధాన వీధులు గుండా సాగింది. సీఐటీయూ మండల కార్యదర్శి తాడంకి నరేష్ మాట్లాడగారు. ప్రజాసంఘాల ప్రతినిధులు జి.కుమారి, వై.నళినికుమారి, సిహెచ్ శ్రీహరి, వి.శివశంకర్, పి.దుర్గాప్రసాద్, ఎం.చంటిబాబు, జాన్‌మోజెస్, వై.జోజి, యు.రమేష్, ఈడా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తక్షణం ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో కార్మికులను సంఘటితం చేసి ఉద్యమించక తప్పదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వై.నరసింహారావు అన్నారు. నూజివీడు రోడ్డులోని సీఐటీయూ కార్యాలయం నుంచి భారీ ర్యాలీతో ప్రధాన రహదారుల్లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజనాల సురేష్, సీఐటీయూ మండల కార్యదర్శి నల్లి ఆంజనేయులు, రైతు సంఘం మండల అధ్యక్షుడు తోట సాంబశివరావు పాల్గొన్నారు.

కేంద్రం విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్



సభలో మాట్లాడుతున్న కేవీవీ. ప్రసాద్

గన్నవరం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించేందుకు కమ్యూనిస్టులు సంసిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. గత రెండు రోజులుగా జరుగుతున్న సీపీఐ జిల్లా మహాసభలు ముగింపు సందర్భంగా బుధవారం స్థానిక రాయ్‌నగర్ కళ్యాణ మండపంలో ప్రతినిధుల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ... 2014 ఎన్నికల ముందు నరేంద్రమోదీ ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటి అమలు చేయలేదని విమర్శించారు. టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని విమర్శించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని ధ్వజమెత్తారు. పార్టీ సీనియర్ నేతలు పెద్దు వెంకటరత్నం, నిర్మల, పోతురాజు నాగేశ్వరరావును సత్కారంచారు. పార్టీ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి అద్దాడ ప్రసాద్, విశాలాంధ్ర పబ్లిషింగ్ ఎడిటర్ గడ్డం కోటేశ్వరరావు, పార్టీ నేతలు దోనేపూడి శంకర్, దుర్గభవాని, పిచ్చియ్య పాల్గొన్నారు.

విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం అందజేత



నగదు బహుమతి అందజేస్తున్న కనకదుర్గ నగర్ కాలనీ పార్క్ వాకర్స్ ప్రతినిధులు

రామవరప్పాడు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మేడవరపు సాయి సింధుకు కనకదుర్గ నగర్ కాలనీ పార్క్ వాకర్స్ గ్రూపు సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం రూ.5116 నగదు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా వాకర్స్ గ్రూపు గౌరవ అధ్యక్షులు రామిశెట్టి కొండల రావు మాట్లాడుతూ సాయి సింధు 600 మార్కులకు గానూ 589 మార్కులు సంపాదించి ట్రిపుల్ ఐటీలో సీటు కూడా సాధించిందని అభినందించారు. విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించాలనే ఉద్దేశంతో అత్యధిక మార్కులు సంపాదించిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ 10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.7500, తృతీయ బహుమతి రూ.5వేలు నగదు బహుమతులు అందించేందుకు వాకర్స్ సభ్యులు నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం తాయారు, వాకర్స్ ప్రతినిధులు మిరియాల వెంకటేశ్వరరావు, సోదాబత్తుల సత్యనారాయణ, అధ్యక్షులు గల్లా కృష్ణ, సెక్రటరి మంగయ్య, ట్రెజరర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వరి నాట్లలో జాగ్రత్తలు పాటించాలి

పెనమలూరు: వరి నాట్లలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ అన్నారు. చోడవరం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. నాట్లు వేసే సమయంలో పొలం దుమ్ము చేసినప్పుడు ఎకరాకు యూరియా 10 కేజీలు, పొటాషియం 20 కేజీలు వాడాలన్నారు. నాట్లు వేసే సమయంలో పొలం దమ్ము సక్రమంగా చేయాలని సూచించారు. అన్నదాత సుఖీభవ ఈ నెల 18వ తేదీన రైతులు బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ చేస్తారన్నారు. రైతులకు అభ్యంతరాలు ఉంటే 13వ తేదీ వరకు గడువు ఉందన్నారు. రైతులు తమ పంటను విధిగా నమోదు చేసుకోవాలని తెలిపారు.

నేడు ముస్తాబాదలో గురుపౌర్ణమి వేడుకలు


గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాదలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు షిరిడీ నాగసాయిబాబా ఆలయం చైర్మన్ పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని, సాయిబాబాకు పుష్పాభిషేకం, సత్యనారాయణ స్వామి వ్రతం జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

సాయి స్వర్ణలో డిజిటల్ ఫ్లోట్ యాక్టివేషన్ ప్రారంభం



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని సాయి స్వర్ణ హ్యుందాయ్ కార్ల షోరూమ్‌లో బుధవారం డిజిటల్ ఫ్లోట్ యాక్టివేషన్ శిబిరాన్ని హ్యుందాయ్ టీఎస్ఎం ధీరజ్, రూరల్ ఎఎస్ఎం హరితేజ్, జనరల్ మేనేజర్ భగత్‌సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా టీఎస్ఎం ధీరజ్ మాట్లాడుతూ సెమీ అర్బన్, రూరల్ ప్రాంతాల్లో తమ కార్లపై మరింత అవగాహన తీసుకొచ్చేందుకై డిజిటల్ ఫ్లోట్ కాన్సెప్ట్‌ను పరిచయం చేశామని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం, సర్వీసింగ్ వంటి పలు విషయాలపై వినియోగదారులకు పూర్తి అవగాహన అందిస్తామన్నారు. గుడివాడ, నూజివీడు పరిసర గ్రామీణ ప్రాంతాల్లో ఈ డిజిటల్ ఫ్లోట్ యాక్టివేషన్ రూపకల్పన చేసినట్లు తెలిపారు.

పార్వతీ అమ్మవారికి శాకంబరీ అలంకరణ



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారికి బుధవారం శాకంబరి అలంకరణ చేశారు. ఆషాఢమాసం మూలానక్షత్రం సందర్భంగా పార్వతీదేవి అమ్మవారికి వివిధ రకాల కూరగాయలు, పండ్లతో శాకంబరి అలంకరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవాని దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత సంగా నరసింహారావు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.భవాని ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కంకిపాడు: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటనపై కంకిపాడు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ డి. సందీప్ తెలిపిన వివరాల మేరకు... మండలంలోని కొలవెన్ను గ్రామానికి చెందిన నవరం వీరఅప్పారావు తాపీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 7వ తేదీన తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి తీర్థయాత్రలకు వెళ్లాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులు తెరచి ఉన్నాయి. మెయిన్ గడియ విరగకొట్టి ఉండటాన్ని గుర్తించాడు. లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరచి ఉండి అందులో ఆరు గ్రాముల బంగారు చెవిదిద్దులు, ఒక కిలో వెండి వస్తువులు, కొంత నగదు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సందీప్ నేతృత్వంలో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్ బృందం రంగంలోకి దిగి వేలిముద్రలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా యుగంధర్



కంకిపాడు: లయన్స్ క్లబ్ ఆఫ్ కంకిపాడు అధ్యక్షుడుగా మద్దుల యుగంధర్ బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలోని పావన్ గాయత్రీ ధ్యానమందిర్‌లో నూతన క్లబ్ పాలకవర్గ ప్రమాణస్వీకారం బుధవారం నిర్వహించారు. క్లబ్ నూతన అధ్యక్షుడుగా మద్దుల యుగంధర్, సెక్రటరీగా నల్లజర్ల నీహార్, ట్రెజరర్‌గా గౌతమి ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. యుగంధర్ మాట్లాడుతూ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలను విస్తరింపచేసేందుకు కృషి చేస్తానన్నారు. క్లబ్ ప్రతినిధి పార్వతీశం మంతెన అంగన్‌వాడీ కేంద్రానికి రూ.5 వేలు వితరణ అందించారు. గోవిందరావు, భారతి, నాంచారయ్య, జ్యోతి, సీతారామప్రసాద్, జిల్లా గవర్నర్ వివిపిఎస్ ఆంజనేయులు, వైస్ గవర్నర్ సిహెచ్ శ్రీనివాసరెడ్డి, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.